
'ఉత్తర' ప్రజలకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు


కె.కె.రాజు

సీతమ్మధార: నూతన సంవత్సరం 2024లోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఉత్తర నియోజకవర్గ ప్రజలకు నెడ్క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. కొత్త ఏడాదిలో మళ్లీ ఆయనే అధికారం చేపట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. తద్వారా రాష్ట్రం మరింత అభివృద్ధి జరుగుతుందని కె.కె.రాజు పేర్కొన్నారు.

గ్రామ సభలతో సమస్యల పరిష్కారం

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు


మాట్లాడుతున్న సమన్వయకర్త కె.కె.రాజు


గ్రామ సభకు హాజరైన స్థానికులు

సీతంపేట: దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు ఎంతగానో ఉపయోగపడతాయని నెడ్క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 45వ వార్డు తాటిచెట్లపాలెం రజకుల కాలనీలో కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ప్రజల సమస్యలు నేరుగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రజకులకు ఇళ్లు ఇచ్చారని, అనంతరం గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో పేద ప్రజలు పట్టాలు పొందలేకపోయారని కె.కె.రాజు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా గృహాల్లో నివాసముంటున్న పేదలకు సంక్రాంతి లోగా పట్టాలు అందజేసేలా చర్యలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, హరిపట్నాయక్, యాదవరాజు, బాబూరావు, దుర్గ, సన్నీ ,నాయుడు, వెంకటరావు, గంట అప్పారావు, రాంబాబు, నరసింగరావు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సింహాచలేశుడికి ఆర్జిత సేవలు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టింపజేసి అష్టోత్తరశత నామావళి పూజ చేశారు.

వెలమల సంక్షేమమే ధ్యేయం


తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు

సీతమ్మధార: వెలమల సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని ఉత్తరాంధ్ర వెలమ సంక్షేమ సేవా సంఘం కమిటీ తీర్మానించింది. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని కార్యాలయంలో ఆదివారం సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు ప్రవేశపెట్టిన తీర్మానాలను సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఉత్తరాంధ్ర వెలమల సెంట్రల్ ఆర్గనైజేషన్ వినతి మేరకు వెలమల సామాజిక భవనం నిర్మాణానికి నగరంలో 75 సెంట్ల స్థలం కేటాయించేందుకు అనుమతి ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత ఉత్తరాంధ్ర వెలమ సామాజిక భవనం అభివృద్ధి, మరమ్మతుల నిమత్తం ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలని నిర్ణయించారు. దూర ప్రాంతం నుంచి వచ్చే వెలమ సామాజిక వర్గం వారికి, నిరుద్యోగులు, ఉద్యోగులకు అతి తక్కువ రుసుంతో వసతి కల్పించాలని తీర్మానించారు. సెంట్రల్ ఆర్గనైజేషన్ భవన మరమ్మతులకు అల్లు శంకరరావు విరాళం ప్రకటించారు. సంఘ అభివృద్ధి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని చెప్పారు. సంఘం అభివృద్ధికి సహకరిస్తున్న పెద్దలు, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు చొక్కాకుల వెంకటరావు, రొంగలి జగన్నాథం, సంఘం అధ్యక్షుడు చుక్క చినబాబు, కార్యదర్శి బండారు రామకృష్ణ, మిడతాన బాపు నాయుడు, చిరికి కొండల రావు, కె.వెంకట రావు, తమటపు కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎఫ్‌లో మేటి


ఎంజీఎఫ్ రోలింగ్ ట్రోఫీని అందుకుంటున్న గవర్నర్ శుభ

మురళీనగర్: వాకర్స్ డిస్ట్రిక్ట్–101 వాకర్స్ ఇంటర్నేషనల్‌లో మేటిగా నిలిచింది. డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ చేసిన కృషి కారణంగా అత్యధికంగా మహాత్మా గాంధీ ఫెలోషిప్(ఎంజీఎఫ్) సభ్యత్వాలు సాధించిన క్లబ్‌గా గుర్తింపు పొందింది. 2018 తర్వాత డిస్ట్రిక్ట్–101కు రోలింగ్ ట్రోఫీ లభించడం విశేషం. ఈ మేరకు వాకర్స్ ఇంటర్నేషనల్ చైర్మన్ పి.రవీంద్ర చేతుల మీదుగా గవర్నర్ శుభ ఈ ట్రోఫీని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమెను పలువురు వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

వ్యాయామంతో ఆరోగ్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు పవన్‌కుమార్, రవికాంత్

మురళీనగర్: ప్రతి రోజూ కొంత సేపు వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నాడీ వ్యవస్థ నిపుణుడు డాక్టర్ ఆర్.పవన్‌కుమార్ అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. వయసు పెరిగిన వారిలో కాళ్లు, చేతులు తిమ్మిర్లు వస్తాయని, వీటిని అధిగమించాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. గుండె వైద్య నిపుణుడు డాక్టర్ టి.రవికాంత్ మాట్లాడుతూ ఆహారంలో నూనె పదార్థాలు తగ్గించి తీసుకోవాలన్నారు.

వైద్య శిబిరంలో 164 మందికి బీపీ, సుగర్ పరీక్షలు, 129 మందికి గుండె సంబంధిత ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అనంతరం వైద్యులను జ్ఞాపిక, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు ఆదిభట్ల రామకృష్ణ, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, పూర్వాధ్యక్షులు బుచ్చయ్య, కృష్ణ మూర్తి, ఎం.భాస్కరరావు, కె.ద్వారకానాథ్, కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి, వడ్డాది అప్పారావు, ఆర్.నాగేశ్వరరావు, టి.వెంకటరమణ, బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సాయి

మద్రిపాలెం: నూతన సంవత్సర వేళ.. కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.సాయి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. నూతన సంవత్సరం నేపథ్యంలో ప్రతి ఒక్కరిపై నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక నిఘా ఉంటుందని, సత్ప్రవర్తనతో ఉండాలని చెప్పారు.

పోలీసుల బందోబస్తు

నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు నగర ప్రజలు సిద్ధమైన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కూడళ్లలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. 10 బృందాలుగా ఏర్పడి పహారా కాశారు. కంచరపాలెం మెట్టు, ఊర్వశి జంక్షన్, బిర్లా జంక్షన్, జ్ఞానాపురం, బర్మాక్యాంప్, మాధవధార ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి ఆంక్షలు విధించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా అన్ని విధాలుగా ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రజలందరికీ కంచరపాలెం పోలీసులు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

2024 క్యాలెండర్ ఆవిష్కరణ


నాట్యం అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఈవో శేఖర్‌బాబు తదితరులు

సీతమ్మధార: నాట్యం (నాట్యకళాక్షేత్రం) మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా దేవాలయ ఈవో పైలా శేఖర్‌బాబు, అసోసియేషన్ డైరెక్టర్ యు.మహేష్‌బాబు, జర్నలిస్టు నాగేశ్వరరావుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొత్త ఏడాది అందరికీ ఆనందాన్ని పంచాలని, విద్యార్థులంతా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పి.వి.రమణమూర్తి, డి.రాజేష్, సీతాశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్‌కు ఘన స్వాగతం


మాధవధారలోని ఓ ఇంటి ముందు వేసిన రంగవల్లిక



51వ వార్డు మాధవధార వుడా కాలనీలో ముగ్గు వేసి కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతున్న మహిళలు, పిల్లలు

మద్రిపాలెం: నూతన సంవత్సరం 2024కు నియోజకవర్గ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు కాగానే కొత్త ఏడాదిలోకి ఉత్సాహంగా అడుగుపెట్టారు. ఒకరికొకరు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేసుకుని కేరింతలు కొడుతూ సందడి చేశారు. జీవీఎంసీ 50, 51, 53 వార్డుల్లో మహిళలు, పిల్లలు తమ ఇళ్ల ముందు రంగురంగుల రంగవల్లికలు వేసి సంబరాలు చేసుకున్నారు. మాధవధార, మద్రిపాలెం ప్రాంతాల్లో ప్రతి ఇల్లు, అపార్ట్‌మెంట్ ముందు రంగులతో అందమైన ముగ్గులు వేసి సెలబ్రేట్ చేస్తున్నారు. రంగవల్లులు ఇళ్లకు కొత్త శోభను తీసుకొచ్చాయి. కొత్త ఏడాదంతా అందరికీ మంచే జరగాలని, హ్యాపీగా ఉండాలని ఆకాంక్షించారు. పాత సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ.. న్యూ ఇయర్‌ను ముచ్చటైన ముగ్గులతో.. ఆనందోత్సాహాలతో ఆహ్వానించారు.

శ్రీకృష్ణుడిగా అప్పన్న

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదోరోజు ఆదివారం వరాహ లక్ష్మీనృసింహస్వామి శ్రీకృష్ణుడి అలంకరణలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీకృష్ణుడిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకీలో తిరువీధి నిర్వహించారు.

డీఆర్ఎం దృష్టికి ఉద్యోగుల సమస్యలు

సింహాచలం: నగరంలోని రైల్వే డివిజన్ ఆస్పత్రిలో ఓపీడీ, పాస్ సెక్షన్‌కు వచ్చే రిటైర్డ్ ఉద్యోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సింహాచలం ప్రాంతానికి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.వి.శేషాద్రి కోరారు. సింహాచలం ప్రాంత రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల అసోసియేషన్ మొదటి సర్వసభ్య సమావేశం ఆదివారం 93వవార్డు శ్రీనివాసనగర్‌లో జరిగింది. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సభ్యులంతా రెండు తీర్మానాలు చేశారు. ఓపీకి వచ్చే వారు కూర్చునేందుకు బెంచీలు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా అత్యంత సీనియర్ సిటిజన్‌లను సత్కరించారు. కవిత్వం, పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి జి.వి.రమణ, కోశాధికారి ఎస్.ఆర్.కె.రాజు పాల్గొన్నారు.